క్లుప్తంగా

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి


మాట్లాడుతున్న రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం

పగిడ్యాల: క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. సోమవారం మండలంలోని లక్ష్మాపురంలో నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిలో పాల్గొన్న ఆయన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. అభ్యుదయ కవి గుంపుల వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎంసీ బాషా, అంబేడ్కర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు ప్రారంభం


సీసీరోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

వెలుగోడు: పట్టణంలోని వివిధ కాలనీల్లో రూ.77.60 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లను శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. మాధవరం గ్రామంలో రూ. 30 లక్షలతో నిర్మించిన నాలుగు సీసీరోడ్లతో పాటు కేజీబీవీ పాఠశాల ప్రహరీ గోడను అందుబాటులోకి తెచ్చారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసగౌడ్, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, నాయకులు శేషిరెడ్డి, కలాం, మొమిన్ రసూల్, ఖలీల్ పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాడ వీధిలోని నిత్య కళావేదికపై హైదరాబాద్‌కు చెందిన మహతి నృత్య కళానికేతన్ వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో గణపతి ప్రార్థన, మూషికవాహన, లింగాష్టకం, అయిగిరినందిని, శివాష్టకం, శివతాండవం తదితర గీతాలకు, అష్టకాలకు హర్షిత, శరణ్య, హేమ, మహతి, హిమజ్ఞ, కౌముది, మనస్వి, ఆరాధ్య తదితరులు నృత్య ప్రదర్శన చేశారు.

అగ్ని ప్రమాదాల నివారణే లక్ష్యం


పోస్టర్లను విడుదల చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆత్మకూరు: అగ్ని ప్రమాదాల నివారణే లక్ష్యమని ఆత్మకూరు అగ్నిమాపక కేంద్రం అధికారి భీముడునాయక్ తెలిపారు. పట్టణంలోని అగ్నిమాపక కేంద్రంలో సోమవారం అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారం రోజులపాటు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తున్నామని, తొలిరోజు అగ్నిమాపక కేంద్రంలో ఉన్న ఫైర్, అగ్నిమాపక పరికరాలు, కరపత్రాలు, స్టాళ్లు ఏర్పాటు చేశామన్నారు. అగ్నిప్రమాదం జరిగితే ఎలాంటి చర్యలు తీసుకోవాలి తదితర వాటిపై స్టాళ్లలో ప్రదర్శించామని తెలిపారు. ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. పలుచోట్ల అగ్ని ప్రమాదాలపై విస్తృతంగా ప్రదర్శనలు చేపడతామన్నారు.

వరిపైరుపై గడ్డి మందు పిచికారీ.. కేసు నమోదు

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని సంతజూటూరు గ్రామానికి చెందిన నాగమ్మ వరి పైరుపై గడ్డి మందు పిచికారీ చేసినట్లు ఎస్‌ఐ జగన్ మోహన్ తెలిపారు. సోమవారం తన 50 సెంట్ల పొలంలో వరి పైరుపై అదే గ్రామానికి చెందిన సుదర్శనం, భాగ్యమ్మ గడ్డి మందు పిచికారీ చేసినట్లు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. తనకు రూ. 90 వేలు నష్టం జరిగిందని నాగమ్మ పేర్కొంది.

పరామర్శ

నందికొట్కూరు: మండలంలోని అల్లూరు గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు పాపన్నను నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దార సుధీర్ సోమవారం పరామర్శించారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే.. మిడుతూరు మండంలోని బైరాపురం గ్రామ సర్పంచు ఫణిభూషణ్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబాన్ని పరామర్శించారు. జెడ్పీటీసీ జగదీశ్వరరెడ్డి, శాతనకోట సర్పంచు జనార్దన్‌గౌడు, నాయకులు పుల్యాల నాగిరెడ్డి, శివరామకృష్ణారెడ్డి, రమేష్‌నాయుడు, రాజు, రమణ ఉన్నారు.

స్ఫూర్తిప్రదాత.. అంబేడ్కర్

- వాడవాడలా అంబేడ్కర్ జయంతి వేడుకలు
- నివాళులర్పించిన అధికారులు, వివిధ సంఘాల నాయకులు



జూపాడుబంగ్లా: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దారాసుధీర్, నందికొట్కూరు: కేజీ రోడ్డులో నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జూపాడుబంగ్లా: అంబేడ్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నందికొట్కూరు ఇన్‌చార్జి డాక్టర్ దారా సుధీర్ తెలిపారు. సోమవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో అంబేడ్కర్ నూతన విగ్రహాన్ని ఆవిష్కరించారు. దళిత సంఘాల నాయకులు ఆర్‌ఎంపీ ఎర్రన్న, చిన్నమల్లయ్య డాక్టర్ దారా సుధీర్‌కు శాలువ కప్పి పూలమాల వేసి మెమెంటోతో సత్కరించారు. జెడ్పీటీసీ పోచా జగదీశ్వర రెడ్డి, సర్పంచ్ మొట్టిబాలయ్య, ఎంపీపీ సువర్ణమ్మ, ఎంపీటీసీ మోతెవెంకటమ్మ, నాయకులు తరుణ్ కుమార్‌రెడ్డి, దినేష్, హరికృష్ణ, గోపాల్‌రెడ్డి, స్వామి రెడ్డి, రమేష్‌నాయుడు, రమణ పాల్గొన్నారు.

నందికొట్కూరు: అంబేడ్కర్ అందరివాడని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దార సుధీర్ అన్నారు. సోమవారం పట్టణంలో సీఎస్‌ఐ పాలెంలో, మిడుతూరు మండలాల్లోని ఆయా గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు, పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లోని చిత్ర పటానికి, కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై, మున్సిపాలిటిలోని అంబేడ్కర్ విగ్రహాలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు అశోక్‌రత్నం, కస్టమ్స్ ఆఫీసర్ వేల్పుల ఆనంద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు ఐజయ్య, లబ్బి వెంకటస్వామి, రవికుమార్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ప్రసంగించారు. జెడ్పీటీసీలు జగదీశ్వరరెడ్డి, సోమల సుధాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మన్సూర్, నాయకులు పుల్యాల నాగిరెడ్డి, లోకేష్ రెడ్డి, శివరామకృష్ణారెడ్డి, రమేష్‌నాయుడు, శివనాగిరెడ్డి, కోకిల రమణారెడ్డి, అబుబక్కర్, రాజు, రఫి, రవి, రమణ, భార్గవ్, చరణ్, రహిమాన్ నివాళులర్పించారు.

పాములపాడు: దేశం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని తహసీల్దార్ సుభద్రమ్మ అన్నారు. సోమవారం ఆ మహనీయుని జయంతి సందర్భంగా స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లులర్పించారు. అలాగే స్థానిక బస్టాండ్ సెంటరులో సర్పంచు మేకల బాగ్యమ్మ, డాక్టర్ నాగన్న, ఎస్‌ఐ సురేష్‌బా బులు, తుమ్మలూరులో సర్పంచు వరప్రసాద రావు, అంబేడ్కర్ విగ్రహానికి నివాళ్లులర్పించారు.

కొత్తపల్లి: మండలంలోని గ్రామాల్లో అంబేడ్కర్ జయంతి సోమవారం జరుపుకున్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ రాజేంద్ర, మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, మాల మహనాడు నాయకులు మల్లయ్య, నాగన్న, కేవీపీఎస్ జిల్లా నాయకుడు సంపత్‌కుమార్, ఎమ్మార్పీఎస్ నాయకుడు నాగరాజు, నాగన్న, దుద్యాలలో దళిత నాయకులు రమేష్, రాజు, శింగరాజుపల్లిలో వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి స్వాములు, విజయ్‌కుమార్, ఎదురుపాడులో వైఎస్సార్‌సీపీ నాయకుడు రహంతుల్లా, వీరాపురం గ్రామంలో కస్టమ్స్ ఆఫీసర్ వేల్పుల ఆనంద్‌కుమార్ నివాళ్లులర్పించారు.

పగిడ్యాల: అంబేడ్కర్ ఆశయాలు భావితరాలకు ఆనుసరణీయమని జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీడీఓ సుమిత్రమ్మ, తహసీల్దార్ శివరాముడు అన్నారు. సోమవారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని స్థానిక ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు.

రాజ్యాంగ నిర్మాతకు నివాళి

ఆత్మకూరు: రాజ్యాంగ నిర్మాత, భారతరత్న బీఆర్ అంబేడ్కర్ జయంతిని సోమవారం శ్రీశైలం నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించారు. ప్రభుత్వ అధికారులు, వివిధ పార్టీల నాయకులు, సంఘాల నేతలు ఆయా కార్యాలయాల వద్ద ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆత్మకూరు పాత బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ పట్టణ, మండలాధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, సయ్యద్‌మీర్, ప్రధాన కార్యదర్శి బట్వారిపల్లి నాగరాజు నివాళులర్పించారు. నాయకులు మొమీన్‌మున్నీర్‌బాషా, బైరాపురం షేక్‌మహబూబ్‌బాషా, మారబోతుల విజయ్, బాలస్వామి పాల్గొన్నారు. ఆర్టీసీ డిపో ఆవరణలో ఆర్టీసీ సీఐ బి.కె.నాయక్, యేసురత్నం, శ్రీనివాసులు, సీపీఎం కార్యాలయంలో పట్టణ కార్యదర్శి రణధీర్ నివాళులు అర్పించారు. పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారూఫ్ పుష్పాంజలి ఘటించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఆత్మకూరు డీఎస్పీ రామంజినాయక్, సీఐ రాము, డాక్టర్ రాయుడు, శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.


బండి ఆత్మకూరు: కోడూరు గ్రామంలో..

- బండి ఆత్మకూరు: బీఆర్ అంబేడ్కర్ జయంతిని మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, గ్రామ పంచాయతీల్లో నిర్వహించారు. ఏ. కోడూరు సర్పంచ్ జ్ఞాన భరణం అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు.
- శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంటలో ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టోర్‌సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. నాయకులు వి.లక్ష్మయ్య, జి.ప్రకాష్, డేవిడ్, ప్రొఫెసర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో ప్రాజెక్ట్ అధికారి కేవీ శివప్రసాద్, రింగ్‌పార్క్ సెంటర్ వద్ద మాలమహానాడు నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.
- వెలుగోడు: స్థానిక బస్టాండ్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీపీ లాలం రమేష్, జిల్లా కోఆప్షన్ సభ్యుడు ఇలియాస్ ఖాన్, పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ జయపాల్ ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వాదం నాగశేషులు, షంషీర్ అలీ, అచ్చయ్య, ఏసురత్నం, నగేష్ నాయక్ పాల్గొన్నారు.
- మహానంది: మండలంలోని పుట్టుపల్లె గ్రామానికి చెందిన యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొమ్మా పాల మహేశ్వరరెడ్డి, నాయకులు రఘురామిరెడ్డి, మల్లి, తదితరులు నివాళులు అర్పించారు. మహానంది గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రిన్సిపాల్ అంబమ్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డీఎంసీ సభ్యులు కాశన్న, రవికాంత్ పాల్గొన్నారు. గోపవరం, గాజులపల్లె రైల్వేస్టేషన్‌లో జయంతి వేడుకలు జరిగాయి.


ఆత్మకూరు: నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


ఆత్మకూరు: కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్


వెలుగోడులో..

మల్లన్నకు సహస్రదీపార్చన సేవ


వెండి రథోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో భ్రమరాంబా మల్లికార్జునస్వామివారికి సోమవారం సహస్ర దీపార్చన సేవ నిర్వహించారు. ముందుగా దేవాలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రాల నడుమ సహస్రదీపార్చన పూజలు చేశారు. ఈ సేవలో భాగంగా మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఆశీనులను చేసి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.


సహస్ర దీపాలను వెలిగిస్తున్న ఆలయాధికారులు


వెన్నుపోటు రాజకీయాల్లో చంద్రబాబు నేర్పరి


సమావేశంలో మాట్లాడుతున్న దారాసుధీర్

జూపాడుబంగ్లా: నమ్మించి మోసగించడం.. వెన్నుపోటు రాజకీయాలు చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వెన్నతోపెట్టిన విద్య అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నందికొట్కూరు ఇన్‌చార్జి డాక్టర్ దారాసుధీర్ విమర్శించారు. సోమవారం తర్తూరులో వైఎస్సార్‌సీపీ నాయకుడు రాధాకృష్ణారెడ్డి ఇంట్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 40ఏళ్ల రాజకీయచరిత్ర అని గొప్పలు చెప్పుకొనే చంద్రబాబునాయుడు రాష్ట్ర బడ్జెట్ ఎంత, ఆదాయం, ఖర్చు ఎంతుందనే వివరాలు తెలియకుండానే సూపర్‌సిక్స్ హామీలను ఇచ్చి ప్రజలను నమ్మించి మోసగించాడన్నారు. హామీలను అమలు చేయకపోవటంతో ప్రజల్లో చంద్రబాబు పాలనపై అసంతృప్తి పెరిగిపోవటంతో ప్రజల దృష్టికి మరల్చేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపిస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తోకలకృష్ణారెడ్డి, నాయకులు పుల్యాల నాగిరెడ్డి,రాధాకృష్ణారెడ్డి, నరేష్‌రెడ్డి, పీఎం మహేష్, తరుణ్‌కుమార్‌రెడ్డి, సుంకిరెడ్డి, పుల్లారెడ్డి పోతులమహేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రమణ పాల్గొన్నారు.


రంగనాథుడి సేవలో: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథ స్వామి వారిని దారాసుధీర్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఈఓ సాయికుమార్ డాక్టర్ దారా సుధీర్‌కు శాలువకప్పి, స్వామివారి పూలమాలతో సత్కరించారు. అర్చకులు ఆశీర్వచనాలు పలికి ఆశీర్వదించారు.

ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలి


మాట్లాడుతున్న వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షురాలు

మహానంది: ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శివనాగమణి డిమాండ్ చేశారు. గాజులపల్లెలో సోమవారం జీపుజాత నిర్వహించి ఉపాధి కూలీలతో మాట్లాడారు. నంద్యాల జిల్లాలో తొమ్మిది వారాల నుంచి ఉపాధి కూలీలకు వేతనాలు ఇవ్వడం లేదని, పనులపై ఆధారపడిన వారు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. పనుల ప్రదేశంలో ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేస్తున్నట్లు చెప్పారు. ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ నాయక్, రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, సీపీఎం మండల కార్యదర్శి కోటకొండ బాషా పాల్గొన్నారు.

తాండ్రపాడు వృషభాల విజయకేతనం


నగదు బహుమతిని అందజేస్తున్న నిర్వాహకులు

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన పాలపండ్ల విభాగం బండలాగుడు పోటీల్లో తాండ్రపాడుకు చెందిన ఆకెపోగు వరలక్ష్మి వృషభాలు విజయకేతనం ఎగురవేసి రూ.40 వేలు గెలుపొందాయి. పోటీల్లో మొత్తం ఐదు జతల ఎద్దులు తలబడ్డాయి. పెద్దకొట్టాల గ్రామానికి చెందిన బోరెడ్డి నారాయణరెడ్డి ఎద్దులు ద్వితీయస్థానంలో నిలిచి రూ.30వేలు దక్కించుకున్నాయి. కానాలకు చెందిన గుండం చెన్నారెడ్డి ఎద్దులు తృతీయస్థానంలో నిలిచి రూ.20వేలు, కొణిదేలకు చెందిన దడు రైడర్‌స ఎద్దులు నాల్గో స్థానంలో నిలిచి రూ.15వేలు, మండ్లెం గ్రామానికి చెందిన షేక్ మహబూబ్‌కు చెందిన ఎద్దులు ఐదో స్థానంలో నలిచి రూ.10వేలు దక్కిచుకున్నాయి. ఫెస్టివల్ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, దొరబాబు, రమణారెడ్డి నగదు బహుమతులను అందజేశారు. దాతలు కిరణ్‌కుమార్, ఎల్లారెడ్డి, సంతోష్‌రెడ్డి, మనోహరప్ప, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు లేకుండా గ్రామసభ

మహానంది: మహానంది గ్రామ సచివాలయంలో సోమవారం స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, వార్డు మెంబర్లు లేకుండానే గ్రామసభ నిర్వహించడం విశేషం. గ్రామసభ ఉందని ఆదివారం దండోరా వేయించారు. అయినా ఎవరూ హాజరు కాకపోవడంతో గ్రామానికి చెందిన ముగ్గురు టీడీపీ నాయకులను పిలిచి వారినే వేదికపై కూర్చోబెట్టి, సచివాలయ సిబ్బందితోనే సమావేశం జరిపారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌ను సాక్షి వివరణ కోరగా పంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులను పిలిచామని, పనుల వల్ల హాజరుకాకపోవడంతో నిర్వహించామని చెప్పారు.

దారి దోపిడీ కేసులో నిందితుడు అరెస్టు



మేకల హనుమంతును అరెస్టు చూపుతున్న ఎస్పీ, సిబ్బంది

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల, గుంటూరు జిల్లాల్లో దారి దోపిడీ, దొంగతనాలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న పాణ్యం చెంచు కాలనీకి చెందిన మేకల హనుమంతు ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. సుగాలి మెట్ట వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని నంద్యాల జిల్లా ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా ఎదుట హాజరు పరిచారు. ఈనేపథ్యంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మేకల చెంచు హనుమంతు జల్సాలకు అలవాటు పడి సన్నిహితులైన మరో నలుగురితో కలిసి 2019 నుంచి నంద్యాల, గుంటూరు జిల్లాల్లో రాత్రి సమయాల్లో దారిదోపిడీలు, దొంగతనాలు చేసేవాడన్నారు. అంతేకాకుండా పలు కేసుల్లో ముద్దాయిగా ఉన్నాడని, అయితే పోలీసులు కళ్లు కప్పి తప్పించుకు తిరుగుతున్నాడన్నారు. సోమవారం సాయంత్రం పట్టుబడటంతో నిందితుడి వద్ద నుంచి 5 తులాల బంగారు, 30 తులాల వెండి, రూ. 12 వేల నగదు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. అరెస్టులో కీలక పాత్ర పోషించిన సీఐ కిరణ్ కుమార్ రెడ్డి, సిబ్బందిని ఎస్పీ ఈసందర్భంగా అభినందించారు.

చైన్ స్నాచర్ల అరెస్టు..

గత కొన్ని నెలలుగా నంద్యాల, ఆత్మకూరు పరిధిలో చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్న మద్దికెరకు చెందిన దూదేకుల షాహిద్‌వలి, కర్నూలు పందిపాడుకు చెందిన పింజరి దస్తగిరిలను సోమవారం నంద్యాల పట్టణంలోని ఆర్‌కే ఫంక్షన్‌హాలు సమీపంలో అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. నిందితుల నుంచి 73 గ్రాములు బంగారం, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


మృతి చెందిన జయకృష్ణ

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని తిమ్మనాయినపేటకు చెందిన యువకుడు సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ రమేష్‌బాబు వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పసల పాపన్న కుమారుడు జయకృష్ణ(23) బెంగళూరులో ఉద్యోగం చేస్తుండేవాడు. ఆరు నెలల నుంచి ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్నాడు. మళ్లీ ఉద్యోగం వస్తుందోరాదో అని మనస్థాపానికి గురయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా


వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

- మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

శ్రీశైలంటెంపుల్: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి భరోసా ఇచ్చారు. సోమవారం శ్రీశైలంలోని అతిథిగృహంలో పార్టీ కార్యకర్తలతో మండల స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కమిటీలను ఏర్పాటు చేశారు. అనంతరం శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని దుయ్యబట్టారు. ఎన్నికల ముందు ప్రజలకు అమలుకాని హామీలను ఇచ్చారని, ప్రజలు అధికారం కట్టబెట్టే సరికి, ఇప్పుడు అమలు చేయలేక చేతులేత్తేశారని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని, ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, వెంకటరెడ్డి, రజాక్, భరత్‌రెడ్డి, పాపారావు పాల్గొన్నారు.

వేధింపుల కేసు నమోదు

కొలిమిగుండ్ల: మండలంలోని కనకాద్రిపల్లెకు చెందిన వివాహిత వెన్నపూస శ్రీవిద్యను అత్తింటి వాళ్లు వేధిస్తుండడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు సోమవారం తెలిపారు. శ్రీవిద్య భర్త పవన్‌కుమార్, అత్తమామతో పాటు ఆడపిల్లలు అదనపు కట్నం తీసుకురావాలని తరచూ వేధిస్తుండేవారు. ఈ క్రమంలో నాలుగు నెలల క్రితం కట్నం తీసుకురావాలని ఇంటి నుంచి బయటకు పంపించారు. అప్పటి నుంచి ఆమె కనకాద్రిపల్లెలోని తల్లితండ్రుల వద్ద ఉంటోంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

వక్ఫ్ చట్టసవరణను రద్దు చేయాలి


పట్టణంలో రోడ్డుపై నమాజు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి, ముస్లింలు

నందికొట్కూరు: కేంద్రం ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంటస్వామి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి పటేల్ సెంటర్ వరకు వక్ఫ్ సవరణను వ్యతిరేకిస్తూ ముస్లిం మైనార్టీ, ప్రజాసంఘాల, వామపక్ష పార్టీల నాయకులతో కలిసి సామాజిక ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు ఆస్తులను కాజేసేందుకే బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నిందని ఆరోపించారు. వక్ఫ్ చట్ట సవరణను రద్దు చేయకపోతే ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృత్తం చేస్తామని హెచ్చరించారు.

వైభవంగా పల్లకీ సేవ

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి ఉమామహేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం స్వామివారి పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఈఓ చంద్రుడు, అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం ఉమామహేశ్వరునికి అభిషేకం, అర్చన తదితర పూజలు చేశారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ముస్తాబు చేసి పల్లకీలో కొలువుంచారు. ఆలయ ప్రాకారంలో ఊరేగించారు.